# కుమ్రం భీంకు ఆదివాసుల ప్రత్యేక పూజలు


దేవతల ప్రతిమలతో కుమ్రం భీం విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఆదివాసులు

బెజ్జూర్, అక్టోబర్ 23 : కుమ్రం భీం వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఆదివాసీ సంప్రదాయాలతో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవనం నుంచి ఆదివాసీలంతా డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా బస్టాండ్ వద్దనున్న కుమ్రం భీం విగ్రహం వద్దకు వచ్చారు. లక్ష్మీదేవి, పోతురాజు తదితర దేవతా ప్రతిమలకు పూజలు చేశారు. భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిడం సకారాం, కుర్సింగ ఓం ప్రకాశ్, కోర్తె తిరుపతి, కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ

మంచిర్యాల కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | గురువారం 24 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# మంచు కురిసే వేళలో..

బెజ్జూర్ మండలంలో బుధవారం ఉదయం పొగమంచు దట్టంగా కమ్ము కున్నది. ఉదయం 6 గంటల నుంచి 8 వరకు రోడ్లపై ఎదురుగా వచ్చేవి కనిపించక పోవడంతో హెడ్ లైట్లు వేసుకొని వాహనాలు నడిపించాల్సి వచ్చింది. పొగమంచుతో పొలాలకు వెళ్లేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు.

-బెజ్జూర్, అక్టోబర్ 23


పొగమంచు కమ్ముకోవడంతో ఉదయం పూట లైట్ల వేసుకొని వెళ్తున్న వాహనదారులు


తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అధికారులకు విన్నవిస్తున్న ఎన్‌హెచ్-63 భూ నిర్వాసితులు

# ‘ఎన్‌హెచ్-63’ బాధితులకు నోటీసులు

- కొందరు తిరస్కరించడంతో గోడలకు అంటించిన అధికారులు
- మార్కెట్ ధర చెల్లించాలంటున్న భూనిర్వాసితులు

లక్షెట్టిపేట, అక్టోబర్ 23: ఆర్మూర్ నుంచి జగిత్యాల మీదుగా మంచిర్యాల వరకు నాలుగు వరుసల హైవే (ఎన్‌హెచ్-63)నిర్మాణానికి గతంలో సర్వే చేపట్టగా ఎట్టకేలకు అధికారులు భూనిర్వాసితులకు నోటీసులు జారీ చేశారు. కొందరు నోటీసులు తీసుకోగా మరికొందరు తిరస్కరించారు. గతంలో పలు మార్లు హైవే నిర్మాణం కోసం సర్వే చేస్తున్న అధికారులను భూనిర్వాసితులు, రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వం ఎట్టకేలకు పోలీసు బందోబస్తు మధ్య సర్వే పనులు పూర్తి చేసింది. గత ఆగస్టులో నోటీసులిచ్చేందుకు ప్రయత్నించగా బాధితులు తిరస్కరించారు. భూమిని కాపాడుకునేందుకు బాధితులంతా ఏకమై హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 27 వరకు బాధితుల జోలికి ఎవరూ వెళ్లవద్దని కోర్టు స్టే ఇచ్చింది. కానీ అధికారులు కోర్టు పరిధికి లోబడి భూమిపైకి వెళ్లకుండా తదుపరి ప్రక్రియను పూర్తి చేస్తున్నారు.

### నోటీసులు తిరస్కరించిన బాధితులు

కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఈ నెల 22న మండలంలోని పోతపల్లి, మిట్టపల్లి, లక్షెట్టిపేట, గుల్లకోట, ఇటిక్యాల, మోదెల గ్రామాల్లో హైవేలో భూమిని కోల్పోతున్న రైతులను గుర్తించి వాళ్లకు నోటీసుల్విడం ప్రారంభించారు. తహసీల్దార్ స్వయంగా సిబ్బందితో వెళ్లి పట్టాదారులకు అవగాహన కల్పిస్తూ నోటీసులు అందిస్తున్నారు. కొంతమంది స్వచ్ఛందంగా నోటీసులు తీసుకోగా మరికొంత మంది నోటీసులు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నోటీసులను బాధితుల ఇంటి గోడలకు అంటిస్తున్నారు. గతంలో భూములను ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం సమయంలో ఇచ్చామని, ఇప్పుడు మళ్లీ మార్కెట్ ధరకు కాకుండా తక్కువకే భూమిని ఇవ్వబోమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులంతా ఏకమై బుధవారం తహసీల్ కార్యాలయానికి చేరుకోవడంతో హైవే అథారిటీ అధికారులు, ఎమ్మార్వో బాధితులకు నచ్చజెప్పారు. కొంతమంది రైతులు నోటీసులు తీసుకొని వెళ్లిపోయారు.


గోడకు అంటించిన నోటీసులను చూపిస్తున్న బాధితుడు

### మార్కెట్ ధర చెల్లించాలి..



నాకు లక్షెట్టిపేట మున్సిపాలిటీలో సుమారు ఎకరంపైగా వ్యవసాయ భూమి హైవే రోడ్డు నిర్మాణంలో అధికారులు తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు మున్సిపాలిటీలో గుంట భూమి కూడా కొనుక్కునేలా లేదు. మార్కెట్ ధరలు చూస్తే లక్షలు, కోట్లలో పలుకుతున్నది. నాకున్న భూమి ఇండ్ల సమీపంలో ఉండడంతో ధర చాలా ఎక్కువగా పలుకుతున్నది. అధికారులు ప్రభుత్వం నిర్ణయించిన ధర కాకుండా మార్కెట్‌లో ఉన్న ధరను అందిస్తే సంతోషంగా ఉంటుంది. ఈ భూములు పోతే మాకు వ్యవసాయం చేసుకునేందుకు భూమి కూడా లేదు. ఎక్కడైనా కూలీ నాలీ చేసుకోవడం తప్పా వేరే దిక్కు లేదు.

-కొట్టె మహేశ్, భూనిర్వాసితుడు, లక్షెట్టిపేట

### నోటీసులు తీసుకోకపోతే నష్టపోతారు..



ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు నాలుగు వరుసల హైవే నిర్మాణానికి భూమి కోల్పోతున్న రైతులు తమకు ఇచ్చే నోటీసులు స్వచ్ఛందంగా తీసుకోవాలి. నోటీసులు తీసుకోకుంటే నష్టపోయేది బాధితులే. నోటీసులు తీసుకోని వారి ఇండ్ల గోడలకు నోటీసులు అంటిస్తున్నాం. నోటీసులు తీసుకున్న ప్రతి ఒక్కరూ పట్టాదారు పాసు పుస్తకం, పాన్ కార్డు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ కార్యాలయంలో అందజేయాలి. వాళ్ల భూముల్లో బోరుబావి, షెడ్డు, ఇండ్లు, ప్రహరీతోపాటు చెట్లు, పూల, పండ్ల మొక్కలు ఏవి ఉన్నా వాటి వివరాలు కూడా లిఖిత పూర్వకంగా ఇవ్వాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా బాధితుడు నష్టపోయేది ఎంతో నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. -దిలీప్ కుమార్, తహసీల్దార్, లక్షెట్టిపేట

# ఔట్ సోర్సింగ్ ఏఈవోలపై సర్కారు కాఠిన్యం

**ఎనిమిది నెలలుగా వేతనాలు అందక అవస్థలు**

- పెరిగిన పనిభారంతో సతమతం
- కుమ్రం భీం ఆసిఫాబాద్‌లో 21 మంది అధికారులపై వేటు!
- సమస్యలు పరిష్కరించాల్సింది పోయి సస్పెన్షనా ?
- ఆందోళన బాటలో ఏఈవోలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ జైనూర్, అక్టోబర్ 23 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వ్యవసాయ శాఖలో ఔట్ సోర్సింగ్ విధానంలో 21 మంది ఏఈవోలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రైతుల సంక్షేమానికి వ్యవసాయ క్షేత్రాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు అహర్నిషలు పనిచేసే ఔట్‌సోర్సింగ్ వ్యవసాయ విస్తరణ అధికారులను ఒకేసారి పెద్ద సంఖ్యలో సస్పెండ్ చేయడంతో వారంతా ఆందోళన బాటపట్టారు. ఎనిమిది నెలలుగా వేతనాలు అందకపోయినా, కుటుంబ పోషణ భారంగా మారినా అప్పులు చేసి మరీ అటు రైతులు, ఇటు ప్రభుత్వానికి సేవలందిస్తున్న ఔట్‌సోర్సింగ్ ఏఈవోలపై కాంగ్రెస్ సర్కారు కర్కశంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెగ్యులర్ ఏఈవోలతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఏఈవోలకు 8 నెలలుగా వేతనాలు ఇవ్వకపోగా సస్పెన్షన్ వేటు వేయడంతో వారు ఆందోళన బాటపడుతున్నారు. మరోవైపు పంటలకు చేతికి వచ్చే సమయంలో గ్రామాల్లో ఏఈవోల పాత్ర ఎంతో కీలకమైనదని, ఈ పరిస్థితిలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



**ఎనిమిది నెలలుగా నో సాలరీ..**

జిల్లాలో 50 మంది రెగ్యులర్ ఏఈవోలు ఉండగా ఔట్‌సోర్సింగ్‌పై 21 మంది ఏఈవోలు పనిచేస్తున్నారు. రెగ్యులర్ ఏఈవోలతో సమానంగా క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఈవోలు ప్రభుత్వం అమలు చేసే పథకాలను అర్హులకు అందించడంతో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గత మార్చి నుంచి వీరి వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ఇటీవల వీరిపై అనేక రకాల పనిభారం పడింది. డిజిటల్ సర్వే పేరుతో ప్రభుత్వం అదనపు పనిభారాన్ని మోపడం, నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడంతో క్షేత్రస్థాయికి వెళ్లి విధులు నిర్వహించేందుకు కూడా ఆర్థిక ఇబ్బందులు కలుగుతుండడంతో విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొన్నది. వీరిపై సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వీరిపై కఠినంగా వ్యవహరించి సస్పెండ్ చేసింది.

**సర్వేలతో మరింత పనిభారం..**

ఏఈవోలపై రోజురోజుకూ పనిభారం పెరుగుతున్నది. ఇటీవల సర్కారు చేపట్టిన రుణమాఫీతో రెండు నెలలుగా ఏఈవోలు తీరిక లేకుండా పనిచేస్తున్నారు. రుణమాఫీ కాని రైతుల నుంచి విమర్శలు సైతం ఏఈవోలపై వస్తున్నాయి. రైతుల వద్దకు వెళ్లి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి వారి సందేహాలు నివృత్తి చేయడం, పంటల సర్వేలు చేపట్టడం, ప్రభుత్వం ఎప్పుడు ఎలాంటి సర్వేలు అడుగుతుందో తెలియని పరిస్థితిలో ఉండేది. రైతుల కోసం నిత్యం వ్యవసాయ క్షేత్రాల్లో నిరంతరం పనిచేసే ఏఈవోలపై పనిభారం పెరుగడం నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కనీసం బయట అప్పులు కూడా పుట్టని పరిస్థితి నెలకొన్నది. ఏఈవో పరిస్థితి దుర్భరంగా మారింది.

### ఎనిమిది నెలలుగా వేతనాలు రావడం లేదు



మాకు ఎనిమిది నెలలుగా వేతనాలు రావడం లేదు. రైతుల కోసం నిరంతరం కష్టపడి చేసే మాకు కొన్ని నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఇల్లు గడవడమే కష్టంగా మారింది. ప్రభుత్వం వివిధ సర్వేల పేరుతో మాపై పనిభారం మోపుతున్నది. రెగ్యులర్ ఏఈవోలతో సమానంగా మాతో పనిచేయిస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా సెలవులు కూడా వినియోగించుకోకుండా పనిచేస్తున్నాం. అలాంటి మాపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది.

-మెస్రం రాము ఔట్‌సోర్సింగ్ ఏఈవో, జంగాం క్లస్టర్, జైనూర్

### సస్పెండ్ చేయడం సరికాదు



మా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వమే మాపై కఠినంగా వ్యవహరిస్తున్నది. ఎనిమిది నెలలుగా వేతనాలు ఇవ్వకపోగా వివిధ రకాల సర్వేల పేరుతో మాతో తీరిక లేకుండా పనిచేయిస్తున్నది. మాకు రావాల్సిన ఎనిమిది నెలల వేతనాలు వెంటనే విడుదల చేయడంతోపాటు మా సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి.

- ఖలీల్, ఔట్‌సోర్సింగ్ ఏఈవో, కంచన్‌పల్లి క్లస్టర్, లింగాపూర్

# రక్తదానంపై అపోహలు వద్దు

**రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్**

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 23 : రక్తదానంపై ఎవరూ అపోహలు పెట్టుకోవద్దని, ఆపద పరిస్థితుల్లో మీరు అందించే రక్తం బాధితుల ప్రాణాలు కాపాడుతుందని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి మంచిర్యాలలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాల ఫలితంగానే నేడు దేశం, రాష్ట్ర ప్రజలందరూ శాంతియుతంగా, ప్రశాంతంగా ఉన్నారని తెలిపారు. వారి సేవలను స్ఫూర్తిగా తీసుకొని రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. తలసేమియా, సికిల్ సెల్, క్యాన్సర్ రోగులు ప్రమాదాల్లో గాయపడిన వారికి, ఇతర రోగులకు రక్తం అందించి ఆదుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండే వారంతా ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ క్యాంపులో వంద యూనిట్లకు పైగా రక్తాన్ని సేకరించినట్లు వెల్లడించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఏసీపీ ప్రకాశ్, సీఐలు ప్రమోద్ రావు, అశోక్ కుమార్, నరేందర్, నరేశ్ కుమార్, రెడ్ క్రాస్ అసోసియేషన్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, సిబ్బంది, ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్


నృత్యం చేస్తున్న గుస్సాడీలు(ఫైల్)

# నేటి నుంచి దండారీ వేడుకలు

కెరమెరి, అక్టోబర్ 23: మండలంలో దండారీ వేడుకలు గురువారం ప్రారంభం కానున్నాయి. ప్రతి యేటా దీపావళికి ముందు ఆదివాసులు దండారీ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీ. వారి ఆరాధ్య దేవత ‘ఏత్మాసార్ పేన్’కు ప్రత్యేక పూజలు, వేడుకలు నిర్వహించేందుకు ఆదివాసీలు సిద్ధమయ్యారు. కెరమెరి మండలంలోని మోడి, సాకడ గ్రామాల్లో గురువారం సంప్రదాయబద్ధంగా భోగి పండుగ నిర్వహించనున్నారు. డప్పుల దరువు, గజ్జెల మోతలతో గుస్సాడీల నృత్యాలు ఆకట్టుకోనున్నాయి. ఓ వైపు కోలాట నృత్యాలు, మరోవైపు గోండి, రేలా రేలా పాటలపై నృత్యాలు, హాస్యనాటికల ప్రదర్శనలతో హోరెత్తనున్నాయి. ఓ గ్రామానికి చెందిన దండారీ బృందం మరో గ్రామానికి వెళ్లడం, వచ్చిన వారికి ఆతిథ్యం ఇవ్వడం ఆచారంగా వస్తున్నది. దండారీ వేడుకలు ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దండారీని ప్రత్యేక పండుగగా గుర్తించి యేటా వేడుకలకు కోటి రూపాయలు విడుదల చేసి ఒక్కో దండారీ బృందానికి రూ.10వేలు ఆర్థిక సహాయం అందించి ఆదివాసుల ఉత్సవాలకు ప్రోత్సాహం అందించింది.


ఆలయం వద్ద పూజలు చేస్తున్న ఆదివాసులు

# పద్మల్‌పురి కాకో ఆలయంలో భక్తుల సందడి

దండేపల్లి, అక్టోబర్ 23: దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి నది ఒడ్డున ఉన్న పద్మల్‌పురి కాకో ఆలయం భక్తులతో సందడిగా మారింది. బుధవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు చేసి తీరంలోని విగ్రహాల వద్ద పూజలు చేశారు. అనంతరం గోదావరి జలాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి కాకో అమ్మవారికి పూజలు చేశారు. కానుగ నూనెతో తయారు చేసిన గారెలను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో దండారీ గుస్సాడీ, రేలా రేలా నృత్యాలతో సందడి చేశారు.

# భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- ‘ఎన్‌హెచ్ 163జీ’ సర్వే పనుల పరిశీలన

జైపూర్, అక్టోబర్ 23: జాతీయ రహదారి 163జీ నిర్మాణానికి జైపూర్ మండలంలో నిర్వహిస్తున్న భూసేకరణ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులను మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ ఆదేశించారు. బుధవారం ఆర్డీవో రాములు, తహసీల్దార్ వనజారెడ్డితో కలిసి సర్వే పనులను పరిశీలించారు. మంచిర్యాల, వరంగల్, ఖమ్మం, విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి మండలంలోని జైపూర్, టేకుమట్ల, ఎల్కంటి, శెట్‌పల్లి, నర్సింగాపూర్, బెజ్జాల, కుందారం, రొమ్మిపూర్, కిష్టాపూర్, వేలాల గ్రామాల నుంచి 110 హెక్టార్ల భూమి అవసరం కాగా 83 హెక్టార్లు ఇప్పటికే సేకరించారు. మిగతా భూమి సేకరణలో వివిధ కారణాలతో జాప్యం జరుగుతున్నది. ఈ మేరకు సర్వే పనులు పరిశీలించి, రహదారి నిర్మాణంలో కోల్పోతున్న అటవీశాఖ భూములకు ప్రత్యామ్నాయ భూములను గుర్తించాలని, అటవీశాఖ ద్వారా అవసరమైన అనుమతుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు, భూయజమానులు, రైతులు సమన్వయంతో భూసేకరణపై ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

లక్షెట్టిపేట, అక్టోబర్ 23: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. లక్షెట్టిపేటలోని మహాత్మా జ్యోతిబా పూలే కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడల్లో రాణించిన వాళ్లకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా ప్రత్యేక రిజర్వేషన్ కోటా ఉంటుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 450 మంది క్రీడాకారులు క్రీడల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీబీసీడీవో వినోద్‌కుమార్, డీసీవో శ్రీధర్, కళాశాల ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, పీఈటీలు, పీడీలు క్రీడాకారులు పాల్గొన్నారు.


రొమ్మిపూర్ వద్ద సర్వే పనులను పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

### రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 23 : జిల్లాలో ఆశ కార్యకర్తలు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల వివరాలను రిజిస్టర్లలో కచ్చితంగా నమోదు చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని కలెక్టరేట్‌లో డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్, వైద్యాధికారులు కృపాబాయి, పీవో ఫయాజ్‌తో కలిసి ఆశ కార్యకర్తలకు రిజిష్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆశ కార్యకర్తలు 651 మంది ఉన్నారని వీరికి 3,515 రిజిస్టర్లను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్, డెమో వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై తిరుగుబాటు మొదలైంది

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- కాసిపేటలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన యువకులు


బీఆర్ఎస్‌లో చేరిన వారితో కలిసి నినాదాలు చేస్తున్న దుర్గం చిన్నయ్య, నాయకులు

కాసిపేట, అక్టోబర్ 23 : అనేక అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందని, అసమర్థ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య స్పష్టం చేశారు. బుధవారం కాసిపేట మండలం ముత్యంపల్లి గ్రామ పంచాయతీలోని మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి ఆధ్వర్యంలో 62 మంది యువకులు కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేశారు. పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడు రైతు భరోసా కింద రూ.15 వేలు ఇస్తామని, రుణమాఫీ రూ.2 లక్షలు చేస్తామని చెప్పి రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నారని విమర్శించారు. మహిళలకు స్కూటీలు ఇస్తామని ఇవ్వలేదని, వృద్ధులకు రూ.4000, దివ్యాంగులకు రూ.6000 పింఛన్ ఇస్తామని గద్దెనెకి మోసం చేస్తున్నారని అన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తామని చెప్పారని, దీనిపై ప్రశ్నించిన వారిని లాఠీలతో, బూటు కాళ్లతో తన్నిస్తున్నారన్నారు. తమను మోసం చేశారంటూ బెల్లంపల్లి నియోజవర్గం కాసిపేట మండలంలో కాంగ్రెస్ నుంచి పెద్ద సంఖ్యలో యువకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ వాళ్లు చాలా దౌర్జన్యాలు చేస్తున్నారని, పోలీసులతో అక్రమ కేసులు పెట్టిస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలకు భయపడవద్దని కార్యకర్తలు, నాయకులకు భరోసానిచ్చారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, మాజీ సర్పంచ్ ఆడె బాదు, మాజీ ఉప సర్పంచ్ బోయిని తిరుపతి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాంటెంకి వాస్‌దేవ్, కాసిపేట గ్రామ అధ్యక్షుడు అగ్గి సత్తయ్య, లంక లక్ష్మణ్, ఉస్కమల్ల గోపాల్, బన్న శ్రీనివాస్, సుధాకర్, శేఖర్, మల్లేశ్, సాయి కిరణ్, మద్దివేని సాయి, గోమాస సచిర్, దుర్గం సుమంత్, చంద్రశేఖర్, యువకులు పాల్గొన్నారు.

### దండారీ దర్బార్ పోస్టర్ల విడుదల

కాసిపేట మండలంలోని సల్పాలవాగు సమీపంలోని వెంకటాద్రి గుడిలో ఈ నెల 27న నిర్వహించే ఆదివాసీ దండారీ దర్బార్ పోస్టర్లను ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆడె జంగు, పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, సోయం సూరు, ఆత్రం జంగు పాల్గొన్నారు.